# బలగం TV BALAGAM

నిజమే మా బలం.. ప్రజలే మా బలగం

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 11 అక్టోబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4




## ఆదాయ మార్గాలపై దృష్టి పెట్టండి..



- **అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఆదాయ సమీకరణపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం తన నివాసంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి వివిధ శాఖల ఉన్నతాధికారులతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో ఆదాయ సమీకరణాలకు ఉన్న అవకాశాలను సీఎం ఆరా తీశారు. కేసీఆర్ ప్రభుత్వం గడిచిన పదేళ్లలో రూ.7 లక్షల కోట్ల అప్పులు మోపిందని, అప్పటి అప్పులకు వడ్డీలుకట్టేందుకే రాష్ట్ర ఖజానాలో మెజార్టీ వాటా పోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఓ వైపు ఆదాయ మార్గాలు తగ్గుతుంటే అప్పుల భారం పెరుగుతుంటడంతో ఆదాయ వనరులను సమకూర్చుకునేందుకు ఈ సమీక్షలో సీఎం చర్చించారు. ముఖ్యంగా ఆరు గ్యారెంటీల అమలుతో పాటు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కార్యక్రమాలకు ఎక్కడా ఆర్థిక పరమైన ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించినట్టు సమాచారం. కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధుల విషయంలో సీఎం ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది.



## అంబరాన్నాంటిన సద్దుల బతుకమ్మ సంబురాలు

- రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా పూల పండుగ
- పాటలు పాడుతూ, డీజే సౌండ్లతో ఘనంగా సంబరాలు
- ట్యాంక్‌బండ్‌పై ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహణ
- పాల్గొన్న మంత్రి సీతక్క

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ వ్యాప్తంగా బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. గురువారం చివరి రోజైన సద్దుల బతుకమ్మ కావడంతో వేడుకలు ఆకాశాన్నంటాయి. హైదరాబాద్‌లో ట్యాంక్‌బండ్ పరిసరాల్లో ప్రభుత్వం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించగా మంత్రి సీతక్క సహ పలువురు మహిళ నేతలు, మహిళలు, యువతులు పెద్ద ఎత్తున తరలివచ్చి పాల్గొనగా.. మరోపక్క ఊరూవాడా పూలవనంలా మారిపోయింది. మహిళలు, యువతులు, చిన్నారుల ఆటపాటలతో రాష్ట్ర వ్యాప్తంగా సందడి వాతావరణం నెలకొంది. చివరి రోజు సద్దుల బతుకమ్మ సందర్భంగా మహిళలు, యువతులు అంతా ఒక్కచోట చేరి ఆడిపాడుతూ సంబరాలు చేసుకున్నారు. మహిళలంతా తీరొక్క పువ్వులతో అత్యంత భక్తి శ్రద్ధలతో బతుకమ్మను పేర్చారు. మెదక్, కరీంనగర్, నల్గొండ, అదిలాబాద్, నిజామాబాద్, మెదక్, మహబూబ్‌నగర్ తదితర జిల్లాల్లో బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి.



హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పై జరిగిన బతుకమ్మ వేడుకల్లో మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలంగాణ మహిళలు బతుకమ్మను ఆడుతున్నారని తెలిపారు. మన సంస్కృతి సంప్రదాయాలను తెలిపే విధంగా ఈ సంబరాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. వేడుకల్లో మంత్రితో పాటు మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలతా రెడ్డి, పలువురు కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమం చివర్లో లేజర్ షో అందరినీ అలరించింది.



## భవిష్యత్ తరాలకు బతుకమ్మను అందించాలి

- **చెరువులను కాపాడుకోవాలి**
- **మంత్రి సీతక్క**



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణతో పాటు విదేశాల్లోనూ బతుకమ్మ సంబరాలు ఘనంగా జరుగుతున్నాయని తెలిపారు. ఆత్మీయత, భక్తి శ్రద్ధలతో బతుకమ్మ పండుగ నిర్వహించుకుంటున్న ప్రజలకుమంత్రి సీతక్క పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. బతుకమ్మలోని ప్రతి పువ్వుకు ఒక గుణం ఉంటుందన్న సీతక్క.. బతుకమ్మ పండగ వెనక భక్తితో పాటు శాస్త్రీయ కారణాలు కూడా ఉన్నాయన్నారు. గౌరమ్మను చేసే పసుపులో యాంటీబయోటిక్ ఉంటుందని.. చెరువుల్లో వేసే పూలతో నీరు శుద్ధి అవుతుందని తెలిపారు.

బతుకమ్మను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరికీ ఉందని.. భవిష్యత్ తరాలకు మన బతుకమ్మను అందించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ అంటే వాగులు, వంకలు, గుట్టలు, చెరువులని .. చెరువుల మీద ఆధారపడి ఎంతో మంది రైతన్నలు వ్యవసాయం చేస్తున్నారని.. అలాంటి చెరువులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరికీ ఉందని హితవు పలికారు. మహిళలకు తోడుగా ఉండాలని పురుష ప్రపంచానికి ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. మహిళలతో ఎలా ప్రవర్తించాలో తల్లిదండ్రులు పిల్లలకు చిన్నప్పటి నుండే నేర్పించాలని సూచించారు.

## ఏపీ, తెలంగాణ కేడర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులపై కేంద్రం కీలక నిర్ణయం





**తెలంగాణలో పనిచేస్తున్న ఏపీ కేడర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఆంధ్రప్రదేశ్‌లో రిపోర్టు చేయాలి.. కేంద్రం ఆదేశాలు**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఏపీ, తెలంగాణ కేడర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులపై కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణలో పనిచేస్తున్న ఏపీ కేడర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను ఆంధ్రప్రదేశ్‌లో రిపోర్టు చేయాలని ఆదేశించింది. తమను తెలంగాణకు కేటాయించాలన్న వారి అభ్యంతరాలను కేంద్రం తిరస్కరించింది. ఈ నెల 16లోగా ఏపీలో రిపోర్టు చేయాలని ఆదేశించింది. ఈ మేరకు రెండు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్రం ఆదేశాలతో తెలంగాణలో పనిచేస్తున్న ఐఏఎస్ అధికారులు ఆమ్రపాలి కాట, రొనాల్డ్ రోస్, వాకాటి కరుణ, వాణీప్రసాద్, ప్రశాంతి ఏపీలో రిపోర్టు చేయనున్నారు. అలాగే ఐపీఎస్ అధికారులు అంజనీకుమార్, అభిలాష, అభిషేక్ మొహంతి కూడా ఏపీలో రిపోర్టు చేయాల్సి ఉంటుంది.

అయితే వీరంతా తమకు తెలంగాణ కేడర్ కావాలని గతంలో కేంద్రానికి అభ్యర్థనలు పంపారు. అయితే ఈ అభ్యర్థనలను కేంద్ర ప్రభుత్వం తిరస్కరించింది. ఇదే సమయంలో ఏపీలో పని చేస్తున్న తెలంగాణ కేడర్ ఐఏఎస్ అధికారులు ఎస్ఎస్ రావత్, అనంత్ రాము, శివశంకర్, సృజనలను సైతం కేంద్రం రిలీవ్ చేసింది. రాష్ట్ర విభజన సమయంలో కేంద్రం ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను రెండు రాష్ట్రాలకు సర్దుబాటు చేసింది. అయితే కొంతమంది మాత్రం తమను తెలంగాణ కేడర్‌కు మార్చాలని కేంద్రానికి అభ్యర్థనలు పంపారు. అలాగే క్యాట్‌ను సైతం ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో క్యాట్ వారికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. అయితే ఈ తీర్పుపై కేంద్ర ప్రభుత్వం తెలంగాణ హైకోర్టులో పిటిషన్ వేయగా.. అభ్యర్థనలను మరోసారి పరిశీలించాలని హైకోర్టు కేంద్రానికి సూచించింది. దీంతో కేంద్ర ప్రభుత్వం ఇందుకోసం రిటైర్డ్ ఐఏఎస్ దీపక్‌ను నియమించింది. ఈయన నివేదిక ఆధారంగా అధికారుల అభ్యర్థనలను తాజాగా తోసిపుచ్చింది. సొంత రాష్ట్రంలో రిపోర్టు చేయాలని స్పష్టం చేసింది.

## కేసీఆర్ హయాంలో లక్షా 60వేల ఉద్యోగాలు ఇచ్చాము




- **ప్రచారం చేసుకోలేకపోయాం**
- **బీఆర్ఎస్ మాజీ ఎంపీ వినోద్ కుమార్**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

కేసీఆర్ హయాంలో లక్షా 60వేల ఉద్యోగాలు ఇచ్చాము... ఈ విషయం భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్‌కు తెలియకపోతే వారు మంత్రులుగా ఉండటానికి అనర్హులు అని బీఆర్ఎస్ మాజీ ఎంపీ వినోద్ కుమార్ అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో లక్షా 60 వేల ఉద్యోగాలు కేసీఆర్ భర్తీ చేయలేదని సీఎం రేవంత్ రెడ్డి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క చెప్పగలరా..? అని ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో వినోద్ కుమార్ మీడియాతో మాట్లాడారు. "ఉపాధ్యాయుల నియామకాల ప్రోగ్రాంను సీఎం రాజకీయ వేదికగా వాడుకున్నారు. కేసీఆర్ కుటుంబ సభ్యుల ఉద్యోగాలు తీసేస్తే మీకు ఉద్యోగాలు వచ్చాయని రేవంత్ రెడ్డి ఉపాధ్యాయులనుద్దేశించి అన్నారు. కేసీఆర్ హయాంలో రికార్డు స్థాయిలో ఉద్యోగాలు ఇచ్చాం. మేము సరిగా చెప్పుకోలేకపోయాం. మార్కెటింగ్‌లో రేవంత్ రెడ్డిని మించినోడు లేడు. తన రియల్ ఎస్టేట్ వ్యాపారి అని రేవంత్ తనకు తానే ఒక ఇంటర్వ్యూలో చెప్పుకున్నారు. అలా చెప్పుకున్న వారు మార్కెటింగ్‌లో ఎలా ఉంటారో తెలియదా..?

కేసీఆర్ ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలి అని మంత్రులు అడుగుతున్నారు.. వారికి తెలియదా..? ప్రభుత్వం వద్ద లెక్కలు లేవా..? ఇప్పటి వరకు ప్రభుత్వ శాఖల్లో ఎన్ని ఉద్యోగాలు ఖాళీ ఉన్నాయో నిర్ధారించారా..? నిర్ధారిస్తే ఆ వివరాలు రేవంత్ రెడ్డి చెప్పాలి. నిన్న మీరు ఇచ్చిన ఉపాధ్యాయ నియామకాలు కూడా సెప్టెంబర్ 6, 2023 నాడు ఇచ్చిన నోటిఫికేషన్‌కు కొనసాగింపే. కేవలం ఆరు వేల ఉద్యోగాలు నోటిఫికేషన్‌లో అదనంగా కలిపారు. డిసెంబర్ 31, 2024 లోగా 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ మాటిచ్చింది. ఆ ప్రకారం రేవంత్ రెడ్డి ఉద్యోగాలు భర్తీ చేయాలి. రిక్రూట్‌మెంట్ సైకిల్‌లో భాగంగా మొదట ఉద్యోగ ఖాళీలు గుర్తించాలి.. ఆ పనే జరగలేదు. కోదండరాం ఏం చేస్తున్నారు.. సెక్రటేరియట్ వెళ్లి ఖాళీలు గుర్తించి సీఎం రేవంత్‌కు జాబితా ఇవ్వొచ్చు కదా..? నిరుద్యోగులతో సభ పెట్టి ఎన్ని ఖాళీలు ఉన్నాయో రేవంత్ చెప్పాలి" అని వినోద్ కుమార్ అన్నారు.

తెలంగాణ ఉద్యమం సమయంలో ఉద్యమకారుల పైకి తుపాకీ పెట్టిన రేవంత్ రెడ్డి నా గురించి మాట్లాడితే ఎలా? అని వినోద్ కుమార్ మండిపడ్డారు.

మిగితా 2వ పేజీలో



## మంత్రి కొండా సురేఖపై కేటీఆర్ పరువు నష్టం దావా

- **నాంపల్లి ప్రత్యేక కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన కేటీఆర్**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

మంత్రి కొండా సురేఖపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరువునష్టం దావా వేశారు. ఈ మేరకు కేటీఆర్ తరపున ఆయన న్యాయవాది ఉమామహేశ్వరరావు నాంపల్లి ప్రత్యేక కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌లో బీఆర్ఎస్ నేతలు బాల్క సుమన్, సత్యవతి రాథోడ్, తుల ఉమ, దాసోజు శ్రవణ్‌ను సాక్షులుగా పేర్కొన్నారు. తన ప్రతిష్ఠను దెబ్బతీసేలా కొండా సురేఖ వ్యాఖ్యానించారని కేటీఆర్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. మంత్రి కొండా సురేఖ ఇటీవల మీడియాతో మాట్లాడుతూ నాగార్జునపై సంచలన వ్యాఖ్యలు చేశారు. నాగచైతన్య, సమంత విడాకులపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దీంతో ఈ వ్యాఖ్యలపై ఇప్పటికే నాగార్జున పరువునష్టం దావా వేశారు. తాజాగా మంత్రి కేటీఆర్ కూడా పరువునష్టం దావా వేశారు.

## మంత్రి కొండా సురేఖకు కోర్టు నోటీసులు

- **23కు విచారణ వాయిదా**

వివరాలు 2వ పేజీలో

## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు బోనస్..

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 2023-24 సంవత్సరానికి నెల రోజులు బోనస్ ప్రకటిస్తూ కేంద్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. గ్రూప్ సి ఉద్యోగులు, గ్రూప్ బి లోని నాన్ గజిటెడ్ ఉద్యోగులకు ఈ బోనస్ వర్తిస్తుంది. గత ఆర్థిక సంవత్సరంలో కంటిన్యూగా కనీసం ఆరు నెలలు ఉద్యోగం చేస్తే బోనస్ తీసుకోవటానికి అర్హులుగా ఆ ఉత్తర్వుల్లో కేంద్రం ప్రకటించింది

## రతన్ టాటాకు కన్నీటి వీడ్కోలు



**బలగం టీవీ, ముంబై**

దిగ్గజ పారిశ్రామికవేత్త, టాటా సన్స్ గౌరవ ఛైర్మన్ రతన్ టాటా అంత్యక్రియలు ప్రభుత్వలాంఛనాలతో ముగిశాయి. గురువారం ముంబయిలోని ఎన్‌సీపీఏ గ్రౌండ్ నుంచి వర్లి స్మశాన వాటిక వరకు రతన్ టాటా అంతిమయాత్ర జరిగింది. అంతకు ముందు రాజకీయ, పారిశ్రామిక వేత్తలు, క్రీడాకారులు సహచరులు పలువురు ఆయన్ను చివరి సారిగా చూసేందుకు తరలి వచ్చారు. వేలాది ప్రజలు, అభిమానులు కడసారి వీడ్కోలు పలికారు. మహారాష్ట్ర ప్రభుత్వం అధికారిక లాంచనాలతో అంత్యక్రియలు నిర్వహించింది. కేంద్రం తరపున హోం శాఖ మంత్రి అమిత్ షా పాల్గొన్నారు.

పలువురు ప్రముఖుల నివాళ్లు

వ్యాపార సామ్రాజ్యానికి రతన్ టాటా రోల్ మోడల్ (మార్గదర్శి) అని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్స్ ఆఫ్ కామర్స్

మిగితా 2వ పేజీలో

## తహసీల్దార్ల బదిలీలకు గ్రీన్ సిగ్నల్

**బలగం టీవీ, హైదరాబాద్**

తహసీల్దార్ల ఎన్నికల బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ వచ్చింది. ఎన్నికల సమయంలో బదిలీ అయిన తహశీల్దార్లు సొంత జిల్లాలకు తిరిగివెళ్లేలా అవకాశం కల్పించాలని తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్(టీజీటీఏ) మొదటి నుంచి చేస్తున్న కృషి ఫలించింది. ఇప్పటికే ఇదే విషయమై రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీసీఎల్ఏ నవీన్ మిట్టల్‌లను టీజీటీఏ పలుమార్లు కలిసి విజ్ఞప్తి చేసింది. ఎన్నికల బదిలీలపై వినతిపత్రాలను ఇచ్చిన విషయం తెలిసిందే. ఇటీవల రెవెన్యూ మంత్రితో జరిగిన ముఖాముఖి సమయంలోనూ ఇదే విషయాన్ని టీజీటీఏ బలంగా చెప్పడంతో ప్రభుత్వం ఈ విషయంపై ఆలోచన చేసి సానుకూల నిర్ణయం తీసుకుంది. ఎట్టకేలకు బదిలీలకు సంబంధించిన ఐచ్ఛికాలను ఇచ్చుకోవాల్సిందిగా తహశీల్దార్లకు అవకాశం ఇస్తూ సీసీఎల్ఏ ఆదేశాలను జారీ చేశారు. టీజీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రాములు, మహిళా అధ్యక్షురాలు పి. రాధ, ప్రధాన కార్యదర్శి రమేష్ పాక, సెక్రటరీ జనరల్ పూల్‌సింగ్ చౌహాన్ రెవెన్యూ శాఖ మంత్రి శ్రీనివాస్‌రెడ్డి, సీసీఎల్ఏ నవీన్ మిట్టల్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

## పన్నుల వాటాను విడుదల

- **మొత్తం రూ.1,78,173 కోట్లు నిధులు విడుదల**
- **తెలంగాణకు రూ.3,745 కోట్లు..**
- **ఏపీకి రూ.7,211 కోట్లు**

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు రావాల్సిన వాటాను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. మొత్తంగా రూ.1,78,173 కోట్లు పన్ను వాటాను కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ విడుదల చేసింది. ముందస్తు వాటాగా రూ. 89,086.50 కోట్లతో కలిపి రూ.1,78,173 కోట్లు విడుదల చేసింది. ఇందులో తెలంగాణకు రూ.3,745 కోట్లు, ఆంధ్రప్రదేశ్కు రూ.7,211 కోట్లు విడుదల చేసింది.

## ఢిల్లీలో మరో 200 కిలోల కొకైన్ స్వాధీనం

**బలగం టీవి, హైదరాబాద్**

వారం రోజుల్లో ఢిల్లీలో రెండవసారి భారీ మొత్తంలో కొకైన్ పట్టుబడింది. రమేష్ నగర్‌లో ఒక డ్రగ్స్ ముఠాను ఛేదించిన స్పెషల్ సెల్ పోలీసులు రూ. 2,000 కోట్ల విలువేసే 200 కిలోల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. జిపిఎస్ ద్వారా డ్రగ్స్ సరఫరాదారుడి ఆచూకీని కనిపెట్టిన పోలీసులు పశ్చిమ ఢిల్లీలోని రమేష్ నగర్‌లో అతడి స్థావరంపై దాడి చేశారు. అయితే నిందితుడు తప్పించుకుని లండన్‌కు పారిపోగా భారీ మొత్తంలో డ్రగ్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకోగలిగారు. ఢిల్లీ పోలీసులు ఇదే వారంలో రూ. 7,500 కోట్ల విలువైన మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు. వీరంతా ఒకే ముఠాకు చెందినవారిగా పోలీసులు అనుమానిస్తున్నారు. గత వారం దేశ రాజధానిలో 500 కిలోలకు పైగా కొకైన్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు నలుగురు నిందితులను అరెస్టు చేశారు.

## జమ్ముూకశ్మీర్ కు రాష్ట్ర హెూదాకే మా ప్రాధాన్యత: ఒమర్ అబ్దుల్లా

**బలగం టీవి, శ్రీనగర్**

కేంద్ర పాలిత ప్రాంతమైన జమ్మూకశ్మీర్ కు రాష్ట్ర హెూదాను రాబట్టుకోవడానికే తమ ప్రాధాన్యత అని నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ అధ్యక్షుడు , కాబోయే ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తెలిపారు. ఒమర్ అబ్దుల్లానే కాబోయే సీఎం అని ఆయన తండ్రి ఫరూఖ్ అబ్దుల్లా స్పష్టం చేశారు. ఒమర్ మీడియాతో మాట్లాడుతూ కేంద్రంలో ప్రభుత్వం మారితే తప్ప ఆర్టికల్ 370 పునరుద్ధరణ జరగదన్నారు. జమ్మూకశ్మీర్ రాష్ట్ర హెూదా కోసం తమ పోరాటం కొనసాగుతుందన్నారు. సర్వేలన్నీ అనుకూలంగా వెలువడ్డాక కూడా హర్యానాలో కాంగ్రెస్ ఎందుకు ఓడిపోయిందో సమీక్షించుకోవాలన్నారు.

## మంత్రి కొండా సురేఖకు కోర్టు నోటీసులు

- **23కు విచారణ వాయిదా**

**బలగం టీవి, హైదరాబాద్**

తెలంగాణ మంత్రి కొండా సురేఖకు కోర్టు నోటీసులు జారీ చేసింది. కొద్దిరోజుల క్రితం అక్కినేని నాగార్జున కుటుంబం మీద ఆమె చేసిన వ్యాఖ్యలు సంచలనం రేపాయి. ఈ క్రమంలో మంత్రి తమ కుటుంబంపై అమర్యాద పూర్వక వ్యాఖ్యలు చేశారని నాగార్జున కోర్టును ఆశ్రయించి పరువు నష్టం దావా వేశారు.రాజకీయ లబ్ధి కోసమే మంత్రి కొండా సురేఖ తమ కుటుంబంపై తప్పుడు వ్యాఖ్యలు చేశారని సినీ నటుడు నాగార్జున నాంపల్లి కోర్టులో స్టేట్‌మెంట్ ఇచ్చారు. అయితే, తాజాగా స్పెషల్ మెజిస్ట్రేట్ కోర్టు మంత్రి కొండా సురేఖకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ ఈ నెల 23కు వాయిదా వేసింది.



## ఫోర్బ్స్ జాబితాలో మళ్లీ టాప్‌లోకి ముకేశ్ అంబానీ

**బలగం టీవి, హైదరాబాద్**

రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముకేశ్ అంబానీ మరోసారి ఫోర్బ్స్ ప్రపంచ కుబేరుల జాబితాలో అగ్రస్థానంలో నిలిచారు. ఫోర్బ్స్ తాజాగా విడుదల చేసిన భారత్‌లోని 100 మంది సంపన్నుల జాబితాలో అగ్రస్థానంలో నిలిచారు. ఈసారి టాప్–100లో చోటు సంపాదించిన సంపన్నులు సంపద తొలిసారి నికర విలువలో ట్రిలియన్ డాలర్లు దాటినట్లు నివేదిక పేర్కొంది. ఇది భారత్‌లో వ్యాపార వృద్ధి, ఆర్థిక శక్తిని ప్రదర్శిస్తుందని నివేదిక పేర్కొంది. రిలయన్స్ ఇన్వెస్టర్లకు దీపావళి కానుకగా ముకేశ్ అంబానీ ఇటీవల బోనస్ షేర్లను ప్రకటించారు. గత సంవత్సరంలో ముకేశ్ అంబానీ భారీ లాభాలను ఆర్జించారు. ఆదాయం 27.5 బిలియన్ డాలర్లు పెరిగి 119.5 బిలియన్లకు చేరుకుంది. ప్రస్తుత నికర విలువ 108.3 బిలియన్ డాలర్లతో ప్రపంచంలో 13వ సంపన్న వ్యక్తిగా నిలిచినట్లు ఫోర్బ్స్ పేర్కొంది.

ఫోర్బ్స్ సంపన్నుల జాబితాలోని టాప్ వంద మంది వ్యక్తుల్లో 2024లో మొత్తం సంపద 1.1 ట్రిలియన్ డాలర్ల రికార్డు స్థాయికి చేరిందని పేర్కొంది. 2023లో 799 బిలియన్ డాలర్ల ఉండేదని.. ఇది ప్రస్తుతం 40శాతం వరకు పెరిగిందని చెప్పింది. బలీయమైన స్టాక్ మార్కెట్, ఐపీఓలు, మ్యూచువల్ ఫండ్స్ ధనవంతులను కుబేరులుగా మారుస్తుందని ఫోర్బ్స్ పేర్కొంది. గత ఏడాది నుంచి బీఎస్ఈ సెన్సెక్స్ 30శాతం లాభపడడంతో మార్కెట్ రికార్డు స్థాయికి చేరుకుంది. ఫలితంగా జాబితాలో ఉన్న వారిలో 80శాతం కంటే ఎక్కువ మంది సంపన్నులు, 58 మంది తమ నికర విలువకు బిలియన్ డాలర్ల సంపదను జోడించినట్లు ఫోర్బ్స్ పేర్కొంది. ఇక ఈ జాబితాలో 116 బిలియన్ డాలర్ల సంపదతో అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ రెండోస్థానంలో నిలిచారు. ఆయన సోదరుడు వినోద్ అదానీతో కలిసి 48 బిలియన్ డాలర్ల సంపదను జోడించి.. ఈ ఏడాది అత్యధిక డాలర్ గెయినర్స్‌గా నిలిచారని పేర్కొంది.




## నేడు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లకు శంకుస్థాపన

**బలగం టీవి, హైదరాబాద్**

ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లకు శంకుస్థాపనలు జరగనున్నాయి. దసరా పండుగ శుభసందర్భాన్ని పురస్కరించుకుని 11 వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి 28 నియోజకవర్గాల్లో శంకుస్థాపనలు చేస్తుండగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొందుర్గ్ లో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మధిర నియోజకవర్గంలో జరిగే శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారు. రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 20 నుంచి 25 ఎకరాల్లో విశాలమైన క్యాంపస్‌లో ఈ స్కూళ్లను నిర్మించాలని సంకల్పించగా, మొదటి విడతలో 28 చోట్ల చేపడుతున్నారు.అంతర్జాతీయ ప్రమాణాలతో సామాజిక అంతరాలు లేని విద్యను అందించాలన్న లక్ష్యంతో చేపడుతున్న ఈ క్యాంపస్‌లలో అన్ని రకాలైన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తారు. అత్యాధునిక వసతులతో ఏర్పాటు చేయబోయే ఈ స్కూళ్ల నిర్మాణానికి ప్రభుత్వం దాదాపు 5 వేల కోట్ల రూపాయలు వెచ్చించనుంది.

## చెరువుల పరిరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిది



- **హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్**
- **లేక్ మ్యాన్ ఆఫ్ ఇండియా ఆనంద్ మల్లిగవాడ్‌తో వీడియో కాన్ఫరెన్స్**

**బలగం టీవి, హైదరాబాద్**

హైడ్రా కార్యాలయంలో లేక్ మ్యాన్ ఆఫ్ ఇండియా ఆనంద్ మల్లిగవాడ్‌తో గురువారం హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ చెరువుల పరిరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిదని అన్నారు. పర్యావరణానికి చెరువలే ఆదరువు అని అయన పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకు చెరువు తల్లి లాంటిదని ఆయన అభివర్ణించారు. తాగు, సాగు నీరందించే చెరువులు పట్టణీకరణతో ప్రభావాన్ని కోల్పోయాయని అయన ఆవేదన వ్యక్తం చేశారు.కాగా, హైడ్రా కార్యాలయం నుంచి నేరుగా బెంగళూరులో చెరువుల పునరుద్ధరణ జరిగిన తీరును రంగనాథ్ ఈ సమావేశంలో పరిశీలించారు. ఆ క్రమంలో బెంగళూరులో మురుగుతో, నీళ్లు లేకుండా ఉన్న వాటిని ఎలా మంచినీటి చెరువులుగా మార్చారో.. ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఏవీ రంగనాథ్‌కు లేక్ మ్యాన్ ఆఫ్ ఇండియా ఆనంద్ వివరించారు.

అందులోభాగంగా బెంగళూరు మహానగరంలో మొత్తం 35 చెరువులను పునరుద్ధరించిన విధానాన్ని ఈ సందర్భంగా ఆనంద్ సోదాహరణగా తెలిపారు. అతి తక్కువ వ్యయంతో చెరువులకు పునరుజ్జీవనం కల్పించిన తీరును హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఆయన వివరించారు.ఇక మురుగు నీటి కాలువలకు రెండు వైపులా మొక్కలు నాటడం, చెరువులోకి నీరు చేరే లోపే కొంత మేర శుద్ధి జరిగేలా బెంగళూరులో అమలు చేసిన విధానంపై క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేయాలని హైడ్రా అధికారులు నిర్ణయించారు. ఏపుగా పెరిగిన మొక్కలతో చక్కటి పర్యావరణం స్థానికులకు అందుతుందన్నారు. అందుకే ఈ కార్యక్రమంలో స్థానికులను పెద్ద సంఖ్యలో భాగస్వామ్యం కల్పించి.. వారికే నిర్వహణ బాధ్యతలు స్వచ్ఛందంగా తీసుకునేలా కసరత్తు జరుగుతుందని రంగనాథ్ వివరించారు.

## రతన్ టాటాకు కన్నీటి వీడ్కోలు

(మొదటి పేజీ తరువాయి)

అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ) పేర్కొంది. ఆయన మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తున్నట్లు పేర్కొంది. రతన్ టాటా భారత దేశంపైనే చెరగని ముద్ర వేశారని ఫిక్కీ ప్రెసిడెంట్ అనీష్ షా పేర్కొన్నారు. రతన్ టాటా భారత పరిశ్రమకు లెజెండ్ అని కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సిఐఐ) చైర్మన్ సంజీవ్ పూరి పేర్కొన్నారు. ఆయన నుంచి తాము ఎన్నో నేర్చుకున్నామని తెలిపారు. కార్పొరేట్ సామాజిక బాధ్యతలోనూ రతన్ టాటా చెరగని ముద్ర వేశారన్నారు.

## విశ్వం నుంచి మాస్ సాంగ్ విడుదల




**బలగం టీవి, హైదరాబాద్**

గోపీచంద్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'విశ్వం'. శ్రీను వైట్ల దర్శకుడు. పీపుల్ మీడియా, చిత్రాలయం స్టూడియోస్ పతాకాలపై టీజీ విశ్వప్రసాద్, వేణు దోనేపూడి నిర్మిస్తున్నారు. నేడు ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభించింది. తాజాగా ఈ సినిమా నుంచి 'గుంగురు గుంగురు..' అనే మాస్ గీతాన్ని విడుదల చేశారు. భీమ్స్ సిసిరోలియో కంపోజ్ చేసిన ఈ పాటను సురేష్ గంగుల రచించారు. రోహిణి సోరట్ ఆలపించారు. హుషారైన మాస్ బీట్‌తో తెరకెక్కించిన ఈ పాటలో నాయకానాయికల నృత్యాలు హైలైట్‌గా నిలిచాయి. థియేటర్‌లో ఈ పాట ఓ పండగలా ఉండబోతుందని చిత్ర బృందం పేర్కొంది. ఎమోషనల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు.

## రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా నిర్బంధాలతో నడుస్తోంది



- **మంద కృష్ణ మాదిగ**

**బలగం టీవి, హైదరాబాద్**

బీఆర్ఎస్ ప్రభుత్వమే కాదు... ఇప్పటి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా నిర్బంధాలతోనే నడుస్తోందని ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ విమర్శించారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మాదిగలను నమ్మించేందుకు ముఖ్యమంత్రి ఎన్నో ప్రకటనలు చేస్తున్నారని, కానీ వాటిని నమ్మే పరిస్థితి లేదన్నారు. ఎస్సీ వర్గీకరణను అమలు చేయకుండానే 11 వేలకు పైగా ఉపాధ్యాయ నియామకాలు భర్తీ చేశారన్నారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో, ఇప్పటికే ఇచ్చిన నోటిఫికేషన్లకు కూడా వర్గీకరణను వర్తింపజేస్తామని చెప్పిన సీఎం... అమలు చేయకుండానే పోస్టులను భర్తీ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి అసెంబ్లీలో చెప్పిన మాటలకే విలువ లేకుండా పోయిందన్నారు. గ్రూప్ 1, గ్రూప్ 2 పరీక్షలకు వర్గీకరణను వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే వర్గీకరణ తర్వాతే పరీక్షలు నిర్వహించాలన్నారు. గ్రూప్ 4 ఫలితాలు ఇప్పటికే 16 నెలలు ఆగిపోయాయని, వర్గీకరణ జరిగే వరకు మరో రెండు నెలలు వాయిదా వేయాలని విజ్ఞప్తి చేశారు.

కమిటీల పేరుతో కాలయాపన చేసి, కమిషన్ల పేరుతో జాప్యం చేసి, ఉన్న ఉద్యోగాలను కొల్లగొడు తామంటే మాదిగ జాతి ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. ఈ నెల 16న వరంగల్‌లో భారీ సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆ సమావేశంలో ఎమ్మార్పీఎస్ కు చెందిన అన్ని కమిటీల సభ్యులు పాల్గొంటారని వెల్లడించారు.

## ప్రశాంత్‌వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో 'మహాకాళి'

**బలగం టీవి, హైదరాబాద్**

ప్రశాంత్‌వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి వచ్చిన 'హనుమాన్' చిత్రం పాన్ ఇండియా స్థాయిలో ఆదరణ దక్కించుకుంది. ఈ సినిమాకు సీక్వెల్‌గా 'జై హనుమాన్' తెరకెక్కుతున్నది. తాజాగా ప్రశాంత్‌వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి 'మహాకాళి' పేరుతో మూడో చిత్రం రాబోతున్నది. భారతదేశం నుంచి వస్తున్న తొలి ఫీమేల్ సూపర్ హీరో మూవీ ఇదే కావడం విశేషం. ఆర్‌కేడీ స్టూడియోస్ పతాకంపై రమేష్ దుగ్గల్ నిర్మించనున్నారు. గురువారం దుర్గాష్టమిని పురస్కరించుకొని అనౌన్స్ మెంట్ పోస్టర్‌ను విడుదల చేశారు. బెంగాల్ నేపథ్యంలో కాళీదేవి ప్రధానంగా నడిచే కథాంశ మిదని, భారతీయ మహిళ సాధికారత, విశ్వాసం,



ధైర్యానికి ప్రతీకలా ఉంటుందని మేకర్స్ తెలిపారు. 'కాళీదేవి ఉగ్రస్వరూపం, దయార్ధ్రహృదయం నుంచి ప్రేరణ పొంది ఈ కథ తయారు చేశాం. భారతీయ మహిళల అచంచలమైన స్ఫూర్తికి నిదర్శనంలా ఉంటుంది' అని చిత్ర కథా, స్క్రీన్‌ప్లే రచయిత ప్రశాంత్‌వర్మ తెలిపారు. ఆధ్యాత్మిక, పౌరాణిక అంశాల కలబోతగా తెరకెక్కనున్న ఈ చిత్రానికి పూజ అపర్ణ కొల్లూరు దర్శకత్వం వహిస్తారు. ఐమాక్స్ త్రీడీలో కూడా ఈ సినిమాను చూడొచ్చని, భారతీయ, విదేశీ భాషల్లో విడుదలకు సన్నాహాలు చేస్తున్నామని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: స్మరణ్‌సాయి, ప్రొడక్షన్ డిజైనర్: శ్రీనాగేంద్ర తంగాల, రచయిత: ప్రశాంత్‌వర్మ, దర్శకత్వం: పూజ అపర్ణ కొల్లూరు.

## కేసీఆర్‌ను విమర్శించడమే మీ విధానమా

**పది నెలలలో కేసీఆర్ పేరు ఎత్తకుండా ఒక్క సభలో అయినా మాట్లాడారా ? మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి**



**బలగం టీవి, హైదరాబాద్**

కేసీఆర్‌ను విమర్శించడమే మీ విధానమా..? అంటూ రేవంత్ రెడ్డిని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సూటిగా ప్రశ్నించారు. గడిచిన పది నెలలలో కేసీఆర్ పేరు ఎత్తకుండా ఒక్క సభలో అయినా మాట్లాడారా..? అని అడిగారు. డీఎస్సీ నియామక పత్రాల అందజేత సందర్భంగా కేసీఆర్‌ను రేవంత్ రెడ్డి విమర్శించిన తీరుపై సబితా ఇంద్రారెడ్డి ఎక్స్ వేదికగా స్పందించారు.

"విద్యార్థుల ముందు, గురువుల ముందు కేసీఆర్ గారిని విమర్శించడమే మీ విధానమా ముఖ్యమంత్రి గారు గడిచిన పది నెలలలో కేసీఆర్ గారి పేరు ఎత్తకుండా ఒక్క సభలో అయినా మాట్లాడారా ? మాట్లాడేటప్పుడు అది ప్రభుత్వ కార్యక్రమా లేక పార్టీ కార్యక్రమా అని ముఖ్యమంత్రి గారు మర్చిపోతున్నారు.

మీరు ఇచ్చాం అని చెప్తున్న టీచర్ పోస్టులు కేసీఆర్ గారు మంజూరు చేసినవి కావా, హైయర్ ఎడ్యుకేషన్‌లో 3202 పోస్టులు, యూనివర్సిటీ లో 1081 పోస్టులు కేసీఆర్ గారి ప్రభుత్వం మంజూరు చేసినవి కావా? ఇంటర్, టెక్నికల్ మరియు కాలేజియేట్ ఎడ్యుకేషన్ సంబంధించి 3896 కాంట్రాక్టు ఉద్యోగులను కేసీఆర్ గారు రెగ్యులర్ చేశారు అని చెప్తే బాగుండేది. ఎన్నికల ముందు మీరు చెప్పిన 25,000 టీచర్ పోస్టులు ఎందుకు ఇవ్వలేదు అని ఆ గురువుల ముందు చెప్తే బాగుండేది. ఎన్నికలప్పుడు 6000 పాఠశాలలు మూత పడ్డాయి అని అబద్ధం చెప్పిన మీరు, ఆ పాఠశాలల లిస్ట్ విడుదల చేస్తే బాగుండేది.

"మన ఊరు మన బడి" కార్యక్రమం ఎందుకు ఆపేసారో చెప్తే బాగుండేది. 6 లక్షల మంది పేద విద్యార్థులు చదువుతున్న కేసీఆర్ గారు ప్రవేశ పెట్టిన గురుకులాలను ఈ ప్రభుత్వం నిర్వీర్యం చేద్దాం అనుకుంటున్నది అని చెప్తే బాగుండేది.ప్రభుత్వ పాఠశాలలో "బ్రేక్ ఫాస్ట్ స్కీమ్" ఎందుకు ఆపేశారో చెప్తే బాగుండేది. ఎన్నికల సమయంలో చెప్పినట్టు ప్రతి విద్యార్థికి 5 లక్షల విద్య భరోసా కార్డు ఎప్పుడు ఇస్తారో చెప్తే బాగుండేది. 19 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్న మీరు మిగితా పాఠశాలలను గాలికి వదిలేశాము అని చెప్తే బాగుండేది" అని ఎక్స్‌లో పేర్కొన్నారు.

## కేసీఆర్ హయాంలో లక్షా 60వేల ఉద్యోగాలు ఇచ్చాము


(మొదటి పేజీ తరువాయి)

తాను పదవుల కోసం ఏనాడూ పాకులాడలేదన్నారు. తన చరిత్ర అందరికీ తెలుసునన్నారు. ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోతే కేసీఆర్ తనకు ఉద్యోగం ఇచ్చారని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించడం విడ్డూరంగా ఉందన్నారు.తెలంగాణ ఉద్యమంలో తాను మొదటి నుంచి ఉన్నానని పేర్కొన్నారు. తెలంగాణ కోసం ఎంపీగా రాజీనామా చేసి గెలిచానని పేర్కొన్నారు. తెలంగాణ కోసం 32 పార్టీలను ఒప్పించేందుకు కేసీఆర్‌తో పాటు కలిసి తాను ప్రయత్నించానని వెల్లడించారు. ప్లానింగ్ బోర్డు చైర్మన్‌గా తెలంగాణ అభివృద్ధి కోసం పాటుపడినట్లు చెప్పారు. సీఎం తన గురించి హేళనగా మాట్లాడినందువల్లే తాను స్పందిస్తున్నానన్నారు.

పదేళ్ల పాటు కేసీఆర్ ఎన్నో ఉద్యోగాలు ఇచ్చినప్పటికీ తాము ఇంతలా ప్రచారం చేసుకోలేదని కాంగ్రెస్ పార్టీపై మండిపడ్డారు. తాము ఉద్యోగాలు ఇచ్చినప్పుడు నియామక పత్రాలు పోస్టాఫీస్ ద్వారా వెళ్లేవని, కానీ ఇప్పుడు ఎల్బీ స్టేడియంలో ఇస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో ఇచ్చిన నోటిఫికేషన్లకు తామే ఉద్యోగాలు ఇచ్చినట్లుగా కాంగ్రెస్ ప్రచారం చేసుకుంటోందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి దమ్ముంటే 2 లక్షల ఉద్యోగాలు ఇచ్చాక ప్రచారం చేసుకోవాలని సూచించారు. కేసీఆర్ వల్లే తెలంగాణ వచ్చిందని చెప్పిన రేవంత్ రెడ్డి ఇప్పుడు కొరివిదెయ్యం అనడం సరికాదన్నారు.



**దేశ రక్షణలో కీలక భూమిక పోషించే భారత నావికాదళం వికారాబాద్ జిల్లా దామగుండంలో నిర్మించ తలపెట్టిన రాడార్ ప్రాజెక్ట్ పనుల శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆహ్వానం అందించారు. పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి, దామగుండం రాడార్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజ్ బీర్ సింగ్, నేవీ ఉన్నతాధికారులు జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రిని కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈనెల 15న పరిగి నియోజకవర్గంలోని పూడూరు మండలం దామగుండంలో నేవీ రాడార్ ప్రాజెక్టు పనుల శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నారు.**



## దక్షిణ కొరియా రచయిత్రి హాన్ కాంగ్‌కు సాహిత్యంలో నోబెల్ పురస్కారం

**బలగం టీవి, హైదరాబాద్**

లిటరేచర్‌లో దక్షిణ కొరియా రచయిత్రి హాన్ కాంగ్‌కు నోబెల్ పురస్కారం దక్కింది. సాహిత్యంలో ఆమె చేసిన విశేష కృషికి రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ 2024 సంవత్సరానికి గాను నోబెల్‌ను ప్రకటించింది. గతేడాది నార్వేకు చెందిన రచయిత జాన్ ఫోసెకు నోబెల్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. మానవ జీవితపు దుర్బలత్వాన్ని, చారిత్రక విషాదాన్ని ఆమె తన గద్య కవిత్వంతో కళ్లకు కట్టినట్లుగా రాయల్ స్వీడిష్ అకాడమీ తెలిపింది. బుధవారం కెమిస్ట్రీ రంగంలో చేసిన కృషికి ఈ ఏడాది ముగ్గురికి ఈ గౌరవం దక్కింది.

డేవిడ్ బేకర్‌కు కంప్యూటేషనల్ ప్రొటీన్ డిజైన్, ప్రొటీన్ స్ట్రక్చర్ ప్రిడిక్షన్‌లో డెమిస్ హస్సాబిస్, జాన్ ఎం జంపర్‌లకు సంయుక్తంగా నోబెల్‌ను ప్రకటించారు. జాన్ జే హాప్‌ఫీల్డ్, జియోఫ్రీ ఈ హింటన్‌లో భౌతికశాస్త్రంలో చేసిన కృషికి నోబెల్ దక్కింది. వైద్యరంగంలో చేసిన కృషికి విక్టర్ ఆంబ్రోస్, గ్యారీ రువ్‌కున్‌లకు సంయుక్తంగా నోబెల్‌ను ప్రకటించారు.మైక్రో ఆర్ఎన్ఏను కనుగొన్నందుకు ఇద్దరికీ నోబెల్ ఇచ్చారు. తాజాగా సాహిత్యరంగానికి నోబెల్‌ను ప్రకటించారు. ఇక శుక్రవారం నోబెల్ శాంతి పురస్కారాన్ని ప్రకటించనున్నారు. ఆర్థిక రంగంలో నోబెల్‌ను ఈ నెల 14న ప్రకటించనున్నారు. నోబెల్ పురస్కారం అందుకున్న వారికి మిలియన్ డాలర్ల నగదు పారితోషకం అందించనున్నారు. 1896లో మరణించిన అవార్డు వ్యవస్థాపకుడు, స్వీడిష్ ఆవిష్కర్త ఆల్ఫ్రెడ్ నోబెల్ వీలునామా ప్రకారం 1904లో నోబెల్ పురస్కారాలను ప్రకటిస్తూ వస్తున్నారు.

మొదట భౌతిక శాస్త్రంలో, రసాయన శాస్త్రంలో, సాహిత్యంలో, వైద్యశాస్త్రంలో కృషి చేసిన శాస్త్రవేత్తలకు, ప్రపంచ శాంతికి కృషిచేసిన వారికి ఏటా నోబెల్ పురస్కారాలను ప్రకటిస్తూ వస్తున్నారు. అయితే, 1963 నుంచి బ్యాంక్ ఆఫ్ స్వీడన్ నుంచి ఆల్ఫ్రెడ్ నోబెల్ గౌరవార్థం ఆర్థికశాస్త్రంలో కృషి చేసిన వారికి సైతం నోబెల్‌కు ఎంపిక చేయడం జరుగుతున్నది. పురస్కారాలను డిసెంబర్ 10న అవార్డు గ్రహీతలకు ప్రదానం చేయనున్నారు.

# సీఎంకు బీసీ నేతల కృతజ్ఞతలు

**బలగం టీవీ ,హైదరాబాద్**

హైదరాబాద్ లోని జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బీసీ సంక్షేమ సంఘం నేతలు గురువారం ఉదయం కలిశారు. తెలంగాణలో బీసీ సామాజిక, ఆర్థిక, కుల సర్వే ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తూ హర్షం వ్యక్తం చేసారు బీసీ సంక్షేమ సంఘం నేతలు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్,



ఎమ్మెల్యే శ్రీహరి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు, మరికొంతమంది బీసీ సంక్షేమ సంఘం నేతలు హాజరయ్యారు.

## అలయ్ బలయ్‌కు రండి..

**బలగం టీవీ ,హైదరాబాద్**

ఈ నెల 13 న నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరిగే అలయ్ బలయ్ కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మి గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆహ్వానించారు. వారు జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి గారిని కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు.



# పీహెచ్‌సీల్లో బయోమెట్రిక్ పరికరాలు ఏర్పాటు చేస్తాం



- రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**బలగం టీవీ ,వేములవాడ:**

రాజన్న సిరిసిల్ల జిల్లా లోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది హాజరు కోసం బయోమెట్రిక్ పరికరాలు ఏర్పాటు చేయిస్తానని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. గురువారం వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ)ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సంద ర్భంగా ఓపీ, సిబ్బంది హాజరు, రక్త పరీక్షల రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం ఇన్ పేషెంట్, ఔట్ పేషెంట్ వార్డ్, మందులు అందించే గది, ల్యాబ్, ఆసుపత్రి ఆవరణను చూశారు. రోజు ఓపీ ఎంత వస్తుంది? డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా తదితర కేసుల పై ఆరా తీశారు. ఈ సందర్భం గా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ దవాఖాన వైద్యులు, సిబ్బంది ప్రతి రోజూ సమయ పాలన పాటిం చాలని సూచించారు. అందుబాటులో ఉండి.. రోగులకు సేవలు అందించాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని వివరించారు.జిల్లా కలెక్టర్ వెంట వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్య కార్మికులకు వస్త్రాల వితరణ



**బలగం టీవీ ,ఎల్లారెడ్డిపేట**

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం కొండాపూర్ గ్రామంలో బతుకమ్మ దసరా పండగలు పురస్కరించుకొని గ్రామంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు చిగురు వెంకన్న ఆధ్వర్యంలో బట్టలు పంపిణీ చేశారు. చిగురు వెంకన్న మాట్లాడుతూ గ్రామంలో ఎల్లవేళలా పనిచేస్తున్న నిరుపేద గ్రామపంచాయతీ సిబ్బందికి బట్టలు పంపిణీ చేయడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ ముస్తాబాద్ మండల ఓబీసీ మోర్చా అధ్యక్షులు చిగురు వెంకన్న నారోజు రాజు ,అయినని అంజిరెడ్డి, తాటిపల్లి ప్రణీత్, పెద్దూరు శ్రావణ్ కుమార్, గుడికందు మహేందర్ రెడ్డి,గంధం అజయ్ కన్విని జైపాల్ రెడ్డి, దాసోహం శ్రీనివాస్ చారి,ఫాలోజ్ అరుణ్, చిగురు నరేష్,మాదాసు భూమయ్య గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## బొప్పాపూర్ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్‌గా సబేరా బేగం చార్జి

**బలగం టీవీ ,ఎల్లారెడ్డిపేట**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల బొప్పాపూర్ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ గా మంగళవారం షేక్ సాబేర బేగం బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా తనతో పాటు పాలకవర్గంలో ఉన్న 17 మంది సభ్యులు ఉన్నారని అన్నారు. తనకు ఈ బాధ్యతను అప్పగించిన సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జ్ కేకే మహేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మంత్రి పొన్నం ప్రభాకర్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా తనతో పాటు పాలకవర్గ సభ్యులు పనిచేస్తామన్నారు. ఈనెల 15 నుండి వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవుతున్నాయని సన్న వడ్లకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.సన్న వడ్లకు ప్రభుత్వం 500 రూపాయల బోనస్ ను కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు.బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి,డైరెక్టర్లు సూడిద రాజేందర్,గణపతి తిరుపతి రెడ్డి, నాయకులు నారాయణరెడ్డి,గంట చిన్న లక్ష్మి,కిష్టారెడ్డి ,సత్యం రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, శెట్టిపల్లి బాలయ్య, లక్ష్మారెడ్డి మాజీ సర్పంచులు నేవూరు వెంకటరెడ్డి,మల్లారెడ్డి కొండాపురం బాల్ రెడ్డి, ఊటీ మేడిపల్లి,దేవానందం,ముక్క శంకర్ ,రవి,నాయకులు మర్రి శ్రీనివాస్ రెడ్డి,అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


# తేనెటీగల దాడిలో రైతు మృతి

**బలగం టీవీ ,రాజన్న సిరిసిల్ల**

తేనెటీగల దాడిలో ఓ రైతు మృతి చెందగా, అతని కొడుకుతోపాటు మరో ముగ్గురికి తీవ్ర గాయాలైన ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం స్తంభంపల్లిలో గురువారం చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. స్తంభంపల్లి గ్రామానికి చెందిన కందాడి లచ్చిరెడ్డి(61), కందాడి నవీన్‌రెడ్డి తండ్రీకొడుకులు. లచ్చిరెడ్డి రోజువారీ మాదిరిగా గురువారం తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. పత్తి చేను వద్ద వ్యవసాయ పనులు చేస్తున్నాడు. ఈ క్రమంలో అక్కడ ఓ చెట్టుకు ఉన్న తేనెటీగ తెట్టెపై చెట్టు కొమ్మ విరిగిపడడంతో తేనెటీగలు లేచాయి. సమీపంలో ఉన్న రైతులు కందాడి లచ్చిరెడ్డి, కందాడి నవీన్‌రెడ్డి, అల్లూరి రవీందర్‌రెడ్డి, నోముల రాజిరెడ్డితోపాటు కూలీ సుభాష్‌పై దాడి చేశాయి. స్థానికులు వెంటనే వీరిని వేములవాడలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ లచ్చిరెడ్డి మృతిచెందాడు. మిగిలిన రైతులు చికిత్స అనంతరం ఇంటికి చేరుకున్నారు. కొడుకు నవీన్‌రెడ్డి దుఃఖంతో దవాఖాన నుంచి ఇంటికి వచ్చి తండ్రి లచ్చిరెడ్డి అంత్యక్రియలు నిర్వహించాడు.

## జమిలి వద్దని కేరళ అసెంబ్లీ తీర్మానం

**బలగం టీవీ ,తిరువనంతపురం**



ఒకే దేశం , ఒకే ఎన్నికలు (జమిలి ఎన్నికలు) నిర్ణయం మానుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కేరళ అసెంబ్లీ కోరింది. ఈ మేరకు గురువారం రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం ఆమోదించారు. జమిలి ఎన్నికలపై ఏర్పాటు అయిన కోవింద్ కమిటీ నివేదికను ఇటీవలే కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. ఈ మేరకు సాధ్యాసాధ్యాలను సానుకూలం చేసుకుని జమిలి నిర్వహణకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ దశలోనే కేరళలోని వామపక్ష కూటమి ప్రభుత్వం నుంచి జమిలి నిర్ణయం ఉపసంహరణకు తీర్మానం వెలువడటం కీలకం అయింది. జమిలి ప్రతిపాదన అప్రజాస్వామికం అని అసెంబ్లీ తీర్మానంతో స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి పినరయి విజయన్ తరపున అసెంబ్లీలో ఈ తీర్మానాన్ని రాష్ట్ర అసెంబ్లీ వ్యవహారాల మంత్రి ఎంబి రాజేష్ ప్రవేశ పెట్టారు. దేశంలోని సమాఖ్య విధానానికి ఈ జమిలి ప్రతిపాదన అడ్డంకిగా మారుతుందని తీర్మానంలో ఆందోళన వ్యక్తం చేశారు.

అన్ని పక్షాల మద్దతుతో జమిలి వ్యతిరేక తీర్మానం ఆమోదం పొందింది. జమిలి ఎన్నికలను వ్యతిరేకిస్తూ తీర్మానం వెలువరించిన తొలి రాష్ట్ర అసెంబ్లీ కేరళనే అయింది. దేశంలోని వైవిధ్యపు సామాజిక, సాంస్కృతిక, రాజకీయ అంతర్లీన లక్షణాలకు జమిలి ప్రక్రియ గండికొడుతుందని... ఎన్నికల వ్యయ భారం తగ్గించేందుకు జమిలి తీసుకువస్తున్నట్లు కేంద్రం ప్రకటించడం అసంబద్ధం అని తీర్మానంలో తెలిపారు. ఎన్నికల వ్యయాన్ని కుదించేందుకు అనేక మార్గాలు ఉన్నాయి. పరిపాలన సజావుగా సాగేందుకు వేరే చర్యలకు దిగవచ్చు. వీటిపై దృష్టి సారించకుండా జమిలికి కేంద్రం జై కొట్టడం దురుద్దేశపూరితం అని తీర్మానంలో స్పష్టం చేశారు. రాజ్యాంగ హక్కులు, ప్రజల భావనలకు , ఇప్పటివరకూ నెలకొని ఉన్న సంవిధానానికి కేంద్రం ప్రతిపాదన విరుద్ధం అవుతోందని విమర్శించారు. జమిలి ఆలోచనలు అన్ని కూడా ఆర్ఎస్ఎస్ , బిజెపిల కలిసికట్టు కేంద్రీకృత అధికార చలామణి అజెండా కోణంలో రూపుదిద్దుకున్నవే అని మంత్రి రాజేష్ పేర్కొన్నారు.

# బ్రూక్, రూట్ విధ్వంసం

- త్రిబుల్ సెంచరీ చేసిన బ్రూక్
- 823 పరుగులకు ఇంగ్లండ్ డిక్లేర్
- 6 వికెట్లు కోల్పోయిన పాక్




**బలగం టీవి, ముల్తాన్**

ముల్తాన్ వేదికగా పాకిస్థాన్‌తో జరుగుతున్న తొలి టెస్టులో ఇంగ్లండ్ పరుగుల వరద పారించింది. హ్యారీ బ్రూక్ ట్రిపుల్ సెంచరీ, జో రూట్ డబుల్ సెంచరీలతో విజృంభించారు. దాంతో ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 7 వికెట్ల నష్టానికి 823 పరుగుల భారీ స్కోరు సాధించి డిక్లేర్ చేసింది.జో రూట్ (375 బంతుల్లో 17 ఫోర్లు 262 పరుగుల), హ్యారీ బ్రూక్ (322 బంతుల్లో 29 ఫోర్లు, మూడు సిక్సర్లతో 317 పరుగులు) పాక్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. వీరిద్దరూ నాలుగో వికెట్‌కు 454 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు.

కాగా, రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన పాకిస్థాన్ నాలుగో రోజు ముగిసేసరికి 6 వికెట్లు కోల్పోయి.. 156 పరుగులు చేసింది. సల్మాన్ అఘా (41 నాటౌట్) టాప్ స్కోరర్ గా నిలిచాడు. తొలి బంతికే క్రిస్ వోక్స్ ఓపెనర్ అబ్దుల్లా షఫీక్(0)ను బౌల్డ్ చేయగా.. అట్కిన్సన్ తన పేస్‌తో షాన్ మసూద్(25)ను బోల్తా కొట్టించాడు. ఇక మాజీ సారథి బాబర్ ఆజాం(5) మరోసారి నిరాశపరచగా.. క్రీజులో కుదురుకున్న సాద్ షకీల్(29)ను జాక్ లీచ్ పెవిలియన్ పంపాడు.82 పరుగులకే 4 వికెట్లు కోల్పోయిన పాక్‌ను అఘా సల్మాన్(41), అమర్ జమాల్(27)లు ఆదుకున్నారు. ఇన్నింగ్స్ ఓటమి తప్పించుకోవాలంటే ఇంకా 115 పరుగులు చేయాల్సి ఉంది.

తొలి ఇన్నింగ్స్‌లో కెప్టెన్ షాన్ మసూద్(151), అబ్దుల్లా షఫీక్(102), అఘా సల్మాన్(104)ల శతకమోతతో పాక్ 556 పరుగులకు ఆలౌటైన సంగతి తెలిసిందే.

# భారత్ టూర్‌కు న్యూజిలాండ్ జట్టు ఇదే..

**బలగం టీవి, న్యూఢిల్లీ**

భారత్‌తో జరగనున్న మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ కోసం 15 మంది సభ్యులతో కూడిన తమ జట్టును న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు ప్రకటించింది. శ్రీలంకతో సిరీస్ సందర్భంగా గాయపడ్డ స్టార్ బ్యాటర్ కేన్ విలియమ్సన్ లేకుండానే కివీస్ జట్టును సెలెక్టర్లు ఎంపిక చేశారు. గజ్జల్లో గాయంతో ఇబ్బంది పడుతున్న విలియమ్సన్ కోలుకునేందుకు మరింత సమయం పట్టే అవకాశమున్న నేపథ్యంలో సెలెక్టర్లు ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. ఈ సిరీస్‌లో కివీస్ జట్టు స్టార్ వికెట్ కీపర్ టామ్ లాథమ్ నాయకత్వం వహించనున్నాడు. శ్రీలంకతో టెస్టు సిరీస్‌లో ఘోర ఓటమి అనంతరం టిమ్ సౌథీ బ్లాక్ క్యాప్స్ కెప్టెన్సీ నుంచి తప్పుకున్న సంగతి తెలిసిందే.

అలాగే ఈ జట్టులో స్టార్ ఆల్‌రౌండర్ మార్క్ చాప్‌మన్‌కు సెలక్టర్లు చోటిచ్చారు. బ్లాక్ క్యాప్స్ తరపున పరిమిత ఓవర్ల క్రికెట్‌లో సత్తాచాటుతున్న చాప్‌మన్.. ఇప్పుడు టెస్టుల్లో




అరంగేట్రం చేసేందుకు సిద్ధమయ్యాడు. మరోవైపు స్టార్ ఆల్‌రౌండర్ మైఖల్ బ్రేస్‌వెల్ కేవలం తొలి టెస్టుకు మాత్రమే అందుబాటులో ఉండనున్నాడు. తన భార్య బిడ్డకు జన్మనివ్వనుండడంతో బ్రేస్‌వెల్ తొలి టెస్టు అనంతరం న్యూజిలాండ్‌కు పయనం కానున్నాడు. అక్టోబర్ 16 నుంచి న్యూజిలాండ్-భారత మధ్య ఈ టెస్టు సిరీస్ ప్రారంభం కానుంది.

**న్యూజిలాండ్ జట్టు: టామ్ లాథమ్ (కెప్టెన్), టామ్ బ్లండెల్ (వికెట్ కీపర్), మైఖేల్ బ్రేస్‌వెల్ (తొలి టెస్టుకు టెస్టు మాత్రమే), మార్క్ చాప్‌మన్, డెవాన్ కాన్వే, మాట్ హెన్రీ, డారిల్ మిచెల్, విల్ ఓరూర్క్, అజాజ్ పటేల్, గ్లెన్ ఫిలిప్స్, రచిన్ రవీంద్ర, మిచెల్ సాంట్నర్, బెన్ సియర్స్, ఇష్ సోధి, టిమ్ సౌథీ, కేన్ విలియమ్సన్, విల్ యంగ్**

# మహాగౌరీ అవతారంలో భాసర అమ్మవారు



**బలగం టీవి, బాసర**

బాసర క్షేత్రంలో శారదీయ నవరాత్రి ఉత్సవాలు ఎనిమిదో రోజుకు చేరుకున్నాయి. గురువారం జ్ఞాన సరస్వతీ దేవి అమ్మవారు మహాగౌరీ అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి అర్చకులు విశేష గౌరీ నామార్చన పూజ చేశారు. అమ్మవారి దర్శనానికి తెల్లవారు జామున ఐదు గంటల నుంచి భక్తులు బారులు తీరారు.గోదావరి నదీలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి నదీ తీరాన గల శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.




# పూర్ణా మార్కెట్.. మట్కా..

**బలగం టీవి, హైదరాబాద్**

వరుణ్ తేజ్ నటిస్తున్న మట్కా సినిమాకు సంబంధించి పూర్ణా మార్కెట్.. మట్కా.. బిహైండ్ ది గేమ్.. యాక్ట్ 1 అంటూ మేకర్స్ ఓ వీడియోను రిలీజ్ చేశారు. మట్కా కోసం మేకర్స్ ఇప్పటికే 1980 బ్యాక్‌డ్రాప్ వైజాగ్ లొకేషన్స్ రీక్రియేషన్‌కు సంబంధించి లాంచ్ చేసిన స్పెషల్ గ్లింప్స్ సోషల్ మీడియాలో ఇప్పటికే చక్కర్లు కొడుతోంది.పలాస 1978 ఫేం కరుణకుమార్ దర్శకత్వంలో పీరియాడిక్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తోన్న ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి, నోరా ఫతేహి హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని నవంబర్ 14న గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్టు తెలియజేస్తూ.. వరుణ్ తేజ్ సూట్‌లో సూపర్ స్టైలిష్‌గా సిగరెట్ తాగుతూ.. మెట్లు దిగుతున్న పోస్టర్ నెట్టింట వైరల్ అవుతోంది. ఈ చిత్రాన్ని వైరా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై తెరకెక్కిస్తున్నారు.



# టెన్నిస్ దిగ్గజం రఫేల్ నాదల్ రిటైర్మెంట్

**బలగం టీవి, న్యూఢిల్లీ**

టెన్నిస్ దిగ్గం రఫేల్ నాదల్ ప్రొఫెషనల్ టెన్నిస్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. ఈ ఏడాది నవంబర్‌లో డేవిస్ కప్ ఫైనల్స్‌లో చివరి ప్రదర్శన చేసిన ఆయన సోషల్ మీడియా వేదికగా ఓ ఎమోషనల్ పోస్ట్ పెట్టాడు. "మీతో ఓ విషయాన్ని పంచుకోవడానికి వచ్చాను. ప్రొఫెషనల్ టెన్నిస్ నుంచి రిటైర్ అవుతున్నాను. గత కొన్నాళ్లు.. ముఖ్యంగా గత రెండేళ్లు కష్టతరంగా సాగాయి. నేను పరిమితులు లేకుండా ఆడానని నేను అనుకోవట్లేదు" అని రఫేల్ నాదల్ పేర్కొన్నాడు.


ఫ్రెంచ్ ఓపెన్ అంటే నాదల్, నాదల్ అంటే ఫ్రెంచ్ ఓపెన్ అన్నట్లుగా క్రీడాభిమానులను అలరించాడు రఫేల్ నాదల్?. అతడి కంచుకోటలో ఊహకందని రీతిలో అతడు ఏకంగా 14 టైటిళ్లను తన ఖాతాలో వేసుకున్నాడు. అయితే ఇటీవలె జరిగిన ఫ్రెంచ్ ఓపెన్‌లో మాత్రం తొలి రౌండ్‌లోనే జ్వెరెవ్ చేతిలో ఓటమిపాలయ్యాడు. ఫ్రెంచ్ ఓపెన్‌లో నాదల్ టైటిళ్ల వేట 2005లో మొదలైంది. ఆ తర్వాత నుంచి అతడికి ఈ ఆటలో తిరుగే లేకుండా పోయింది. అలా 2006, 2007, 2008, 2010, 2011, 2012, 2013, 2014, 2017, 2018, 2019, 2020, 2022లోనూ ఈ స్టార్ ప్లేయర్ విజేతగా నిలిచాడు. ఇతర గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లోనూ సత్తా చాటిన నాదల్, తన కెరీర్‌లో మొత్తం 22 మేజర్ టైటిళ్లను సొంతం చేసుకున్నాడు.

అయితే ఏడాదిన్నరగా అతడ్ని వెంటాడుతున్న గాయాలు, ఫిట్‌నెస్ లేమి, ఇలా పలు కారణాల వల్ల నాదల్‌లో ఒకప్పటి జోరు లేదన్నది విశ్లేషకులు చెబుతున్న మాట తుంటి, ఉదర కండరాల గాయాల కారణంగా నాదల్ ఇబ్బంది పడినట్టు తెలిసింది.

ఫ్రెంచ్ ఓపెన్‌లో తొలిసారి అన్‌సీడెడ్‌గా బరిలోకి దిగాడు. దీంతో తొలి రౌండ్లోనే నాలుగో సీడ్ జ్వెరెవ్‌తో తలపడాల్సి వచ్చింది. అయితే ఆ ఓటమి నేపథ్యంలో నాదల్‌తో పాటు, అతడికిదే చివరి ఫ్రెంచ్ ఓపెన్ మ్యాచ్ అని అర్థమైంది. ఆ సమయంలో నాదల్ మాట్లాడుతూ "అందరికీ కృతజ్ఞతలు. నాకు ఈ సమయంలో మాట్లాడానికి చాలా కష్టంగా ఉంది. ఫ్రెంచ్ ఓపెన్‌లో ఆడటం ఇదే చివరిసారా అన్న ప్రశ్నకు నేను సమాధానం చెప్పలేను. గత రెండేళ్లలో గాయాల వల్ల నేను చాలా ఇబ్బందిపడ్డాను. భవిష్యత్తులో ఏం జరుగుతుందో చెప్పడమైతే కష్టం. కానీ నేను ఇక్కడికి తిరిగి రాకపోయే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. అది నూరు శాతం అని కూడా నేను చెప్పను. ఒలింపిక్స్ కోసం మాత్రం ఇక్కడికి మళ్లీ వస్తానని ఆశిస్తున్నాను" అని అన్నారు.

# రతన్ టాటాకు క్రికెటర్ల నివాళ్లు

**బలగం టీవి, న్యూఢిల్లీ**



రతన్ టాటా తన జీవితంతో పాటు మరణంతోనూ దేశాన్ని కదలించారని సచిన్ టెండూల్కర్ పేర్కొన్నాడు. దిగ్గజ పారిశ్రామికవేత్త మరణ వార్త తనని తీవ్రంగా కలచివేసిందని, తనతో పాటు లక్షలాదిమంది ప్రజలను తీవ్ర దుఃఖంలోకి నెట్టిందని సచిన్ అన్నాడు. నిర్మించిన సంస్థలు, విలువలు ద్వారా రతన్ టాటా వారసత్వం కొనసాగుతుందని తెలిపాడు. సోషల్ మీడియాలో సచిన్ ఎమోషనల్ పోస్ట్ పెట్టాడు. అలాగే ఇతరుల జీవితాలు బాగుకోసం తన జీవితాన్ని గడిపిన గొప్ప వ్యక్తిలా రతన్ టాటా చరిత్రలో నిలిచిపోతారని టీమిండియా క్రికెట్ కెప్టెన్ రోహిత్ శర్మ అన్నాడు. రతన్ టాటాది బంగారు మనసు అని పేర్కొన్నాడు.దేశం గర్వించదగ్గ దిగ్గజం రతన్ టాటా మనల్ని వదిలి వెళ్లిపోయారని వీవీఎస్ లక్ష్మణ్ పోస్ట్ చేశాడు. ఒక తరం ముగిసినట్లు అనిపిస్తోందని, దేశం కోసం రతన్ టాటా ఎన్నో అద్భుతాలు సృష్టించాడని లక్ష్మణ్ తెలిపాడు. ప్రతి ఒక్కరికి మార్గదర్శకులుగా ఆయన నిలిచిపోయారని ట్వీట్ చేశాడు. అసలైన భారత రతనాన్ని కోల్పోయామని, రతన్ టాటా జీవితం మనందరికీ స్ఫూర్తి అని, మన హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోతారని వీరేంద్ర సెహ్వాగ్ పేర్కొన్నాడు. 'రతన్ టాటా ఓ గొప్ప వ్యాపారవేత్త మాత్రమే కాదు, సమాజానికి తిరిగి ఇచ్చే విశయంలో మనందరికీ ఆదర్శంగా నిలిచిన వ్యక్తి. విద్య, ఆరోగ్య రంగాల్లో మార్పులు తీసుకురావడానికి ఎంతో కృషి చేశారు. ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు ఆయన జీవితం ఒక ఆదర్శం' అని యువరాజ్ సింగ్ ట్వీట్ చేశారు

**రతన్ టాటాకు క్రీడలంటే మక్కువ. అందులోనూ క్రికెట్ అంటే ఆయనకు అమితమైన ఇష్టం. ఆ ఇష్టంతోనే కొందరు క్రికెటర్లకు ఆయన అండగా నిలిచారు. టాటా గ్రూప్‌లోని పలు కంపెనీలు మన క్రికెటర్లకు ఉద్యోగావకాశాలు కల్పించాయి. అలాగే వారి ప్రొఫెషనల్ కెరీర్‌కు ఆర్థికంగానూ టాటా గ్రూప్ కంపెనీలు మద్దతుగా నిలిచాయి. మాజీ క్రికెటర్ ఫరూఖ్ ఇంజనీర్‌కు టాటా మోటార్స్ తోడ్పాటు అందించింది. అలాగే సంజయ్ మంజ్రేకర్, అజిత్ అగార్కర్, శ్రీనాథ్, యువరాజ్ సింగ్, హర్భజన్ సింగ్, రాబిన్ ఉతప్ప, కైఫ్‌కు టాటా ట్రస్టు ఆర్థికంగా అండగా నిలిచింది. అలాగే తమ గ్రూప్‌లో ఉద్యోగావకాశాలు కూడా కల్పించింది. వీరితో పాటు శార్దూల్ ఠాకూర్, జయంత్ యాదవ్ కూడా టాటా గ్రూప్ నుంచి సాయం పొందారు. టాటా స్టీల్స్, టాటా పవర్స్, ఎయిర్‌వేస్ విభాగాల్లో టాటా గ్రూప్ ఆయా క్రికెటర్లకు ఉద్యోగాలు కల్పించింది. దీంతోపాటు వారికి స్పాన్సర్ చేస్తూ అండగా ఉండి ప్రోత్సహించింది.**